ప్రజాశక్తి
గురువారం 8 డిసెంబర్ 2022



జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జేఎన్టీయూ పరిధిలో బిటెక్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య కేశవరెడ్డి, పరీక్షల విభాగం కంట్రోలర్ బి.చంద్రమోహన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్శిటీ పరిధిలో నిర్వహించిన బిటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్, బిటెక్ మూడవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ సప్లిమెంటరీ, మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష, బిటెక్ ఒకటవ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష, ఎంటెక్ ఒకటవ సెమిస్టర్ సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ ఒకటవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్, ఎంసిఎ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, ఎంసిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 20), (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంసిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21), (ఆర్ 20), (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంబిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, ఎంబిఎ రెండవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంబిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ, ఎంబిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ పలితాలను విడుదల చేశామని చెప్పారు. పరీక్షా పలితాల కోసం జెఎన్‌టియు వెబ్ సైట్ ను సంప్రధించాలని కోరారు.

నష్టాల ఊబిలో పత్తి రైతు



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎఐకెఎస్ నాయకులు

- ప్రభుత్వాలు ఆదుకోవాలి
- ఎఐకెఎస్ నాయకుల డిమాండ్
- నకిలీ విత్తనాలతో నష్టపోయిన పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరిత్యాలతో పత్తి రైతులు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై స్పందించి వారిని ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు డిమాండ్ చేశారు. అమరవీరుల జ్యోతియాత్ర పేరుతో తెలంగాణ నుంచి చేపట్టిన యాత్ర బుధవారం అనంతపురం జిల్లాకు చేరుకుంది. పామిడి మండలంలోని గజరాంపల్లిలో పత్తి పంటను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, బిటి, నాన్‌బిటి నిష్పత్తిలోని తేడాలు మూలంగా తీరని నష్టం జరిగిందని రైతులు ఎఐకెఎస్ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. పది క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సిన చోట ఒక్క క్వింటాళు కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల రూపంలోనే ఎకరానికి రూ.50వేలు నష్టపోయినట్టు వివరించారు. దీనిపై జాతకు నాయకత్వం వహిస్తున్న కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పత్తి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు భరోసానిచ్చారు. అదే సమయంలో పత్తి రైతుల సంఖ్య ఎక్కువగా ఉండటం, వారి సమస్యలు అధికంగా ఉంటుండటంతో దేశ వ్యాప్తంగా పత్తి రైతుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి జరిగే జాతీయ మహాసభల్లో చర్చించి నిర్ణయం చేస్తామని వివరించారు.

ఐక్యపోరాటాలే మార్గం : ఎఐకెఎస్ నాయకులు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలకు దేశ వ్యాప్తంగా రైతాంగం మరోమారు సన్నద్ధమవ్వాల్సిన అవసరముందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 13 తేది నుంచి మూడు రోజుల పాటు తిరుప్పూర్‌లో అఖిల భారత కిసాన్ సభ మహాసభలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో 'అమర వీరుల జ్యోతి యాత్ర' పేరుతో జాతలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక , తమిళనాడు, కేరళకు వెళ్లే జాత మంగళవారం తెలంగాణలో ప్రారంభమైంది. ఈ జాతా బుధవారం నాడు అనంతపురం జిల్లా పామిడికి చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పామిడి వద్ద జాతకు స్వాగతం పలికారు. పామిడి పట్టణంలో బస్టాండ్ ఆవరణం నుంచి ఎద్దువపల్లి క్రాస్ వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో జాతకు నాయకత్వం వహిస్తున్న ఎఐకెఎస్ నాయకులు కృష్ణ ప్రసాద్, నాయకులు సాగర్, ప్రకాశం మాస్టారు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ యాత్రకు సంఘీభావం తెలిపారు. పామిడి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం టి.సాగర్ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న రైతాంగ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశ్యారు. అందుకు అనుగుణంగానే మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దేశంలోని రైతాంగం ఈ చట్టాలకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత పోరాటం మూలంగా వెనక్కు తగ్గక తప్పలేదని పేర్కొన్నారు. ఈ పోరాటంలో 750 మంది రైతులు అసవులుబాసారని తెలిపారు. వారి గుర్తుగానే ఇప్పుడు అమరవీరుల జ్యోతిజాతను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోరాట సమయంలో ఇచ్చిన కనీస మద్దతు ధర గ్యారెంటీని ఇంత వరకు కేంద్రం ఇవ్వలేదన్నారు. అదే విధంగా రైతులను వ్యవసాయ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు రుణమాఫీ చేయాలని కోరుతున్నామని వివరించారు. రైతుల రుణమాఫీకి కేంద్రం వద్ద డబ్బుల్లేవని చెబుతుండటం చెప్పడం సరైంది కాదని అన్నారు. కార్పొరేట్ సంస్థకు రూ.11 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన వారికి కోట్లాది మంది రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేయడం పెద్ద సమస్య కాదని అన్నారు. కనీస మద్దతు ధర, రుణమాఫీ, సమగ్రమైన పంటలబీమా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరముందన్నారు. అందుకు ఐక్య పోరాటలే మార్గమని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం అనేక సమస్యలు రైతులను పట్టిపీడిస్తున్నాయని చెప్పారు. జిల్లాలోనూ పత్తి,మిరప, వేరుశనగ తదతర పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయన్నారు. పత్తి పంట అవుతే నకిలీ విత్తనాల సమస్య కూడా ఉందన్నారు. పెద్దఎత్తున రైతులు నష్టపోయారని వివరించారు. ఈ రైతులను ఆదుకునే చర్యలేవి తీసుకోవడం లేదని విమర్శించారు. బీమా ద్వారానైనా ఆదుకోవాలి, లేకపోతే కంపెనీలైనా నష్ట పరిహారాన్ని చెల్లించాలన్నారు. ఇందుకు స్థానికంగానున్న రైతులందరూ ఏకమై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వృత్తిదారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిక్షాటనను అడ్డుకోవడంతో పోలీసులతో వాదిస్తున్న జెసిపిఆర్



తన ఇంటి వద్ద డివైడర్‌పై కూర్చొని నిరసన తెలుపుతున్న ప్రభాకర్‌రెడ్డి

బిక్షాటన.. భగ్నం..!

- జెసి.ప్రభాకర్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- చెత్తవాహనాల మరమ్మతుపై నిరసన
- రెండు రోజుల్లో స్పందించకుంటే గోచీకట్టుకుని నిరసన చేస్తా :జెసిపిఆర్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి మున్సిపాలిటీలో చెత్త సేకరణ కోసం కేటాయించిన చెత్త వాహనాలు పాడైపోయి మూలకు పడ్డా, వాటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ నిధుల సమీకరణ పేరుతో బుధవారం నాడు బిక్షాటనకు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు తన ఇంటి నుంచి పట్టణంలో బిక్షాటన చేసేందుకు బయల్దేరిన ఆయన్ను పోలీసులు అడ్డుకున్నారు. 9 గంటలకే పెద్దఎత్తున పోలీసు బలగాలు సంజీవనగర్‌లోని జెసి.ప్రభాకర్ రెడ్డి నివాసం చుట్టూ మోహరించాయి. జెసిపిఆర్ నివాసానికి అటు ఇటుగా వాహనాలు, పాదచారుల రాకపోకలను నిలిపేశారు. 10 గంటల సమయంలో ప్రభాకర్‌రెడ్డి టిడిపి కౌన్సిలర్లు, కార్యకర్తలను వెంటబెట్టుకుని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న చెత్త వాహనాల షెడ్డు వద్దకెళ్లారు. అక్కడ పాడై మూలనపడ్డ వాహనాలను పాత్రికేయులకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మున్సిపాలిటీకి అవసరమైనన్ని చెత్త వాహనాలను సమకూర్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాటి నిర్వహణ బాధ్యతను చూసుకున్నామని చెప్పారు. మున్సిపాల్టీని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నెంబవర్ వన్‌గా నిలిపామన్నారు. అలాంటి మున్సిపాల్టీని వైసిపి పాలనలో నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి ప్రజలు తనపై నమ్మకం ఉంచి అత్యధికమంది టిడిపి కౌన్సిలర్లను గెలిపించారన్నారు. వారి ఆశలను వమ్ము చేయకూడదన్న ఉద్దేశంతో అధికార పార్టీ నేతలు ఎన్ని ఆటంకాలు, అవరోధాలు కల్పిస్తున్నా కష్టనష్టాలకోర్చి 'గ్రీన్ తాడిపత్రి - సేవ్ తాడిపత్రి' నినాదంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. భూగర్బ డ్రెయినేజీని ఏర్పాటు చేయాలని చూస్తుంటే వైసిపి నేతలు అడ్డుకుంటున్నారని పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని విమర్శించారు.

బిక్షాటనను భగ్నం చేసిన పోలీసులు

అనంతరం ప్రభాకర్ రెడ్డి టిడిపి కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి పట్టణంలో భిక్షాటన చేపట్టేందుకు ఉపక్రమించారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు రాగానే పామిడి రూరల్ సిఐ, తాడిపత్రి పట్టణ, రూరల్ అప్ గ్రేడ్, రూరల్ సిఐలు రామకష్ణ, ఆనందరావు, చిన్న పెద్దయ్య, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణ, రూరల్ అప్ గ్రేడ్, పెద్దపప్పూరు, పుట్లూరు ఎస్ఐలు ధరణి, గౌస్, ఖాజా హుస్సేన్, గురుప్రసాద్ రెడ్డిలు పోలీసు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. పట్టణంలో 30 యాక్ట అమల్లో ఉన్నందున కార్యక్రమాన్ని అనుమతించమంటూ పోలీసులు తెలిపారు. ఈ సమయంలో టిడిపి శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం 'గ్రీన్ తాడిపత్రి-సేవ్ తాడిపత్రి' అన్న నినాదం రాసి ఉన్న ప్ల కార్డును మెడలో వేసుకుని జెసిపిఆర్ టిడిపి కౌన్సిలర్లతో కలసి తన నివాసం ఎదుటే డివైడర్ మీద కూర్చుని నిరసన తెలిపారు. పట్టణంలోకి పోలీసులు అనుమతించకపోవడంతో జెసిపిఆర్ ఆయన నివాసంలోకి వెళ్లిపోయారు. చెత్త వాహనాలపై అధికారులు, ప్రభుత్వం స్పందిచకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోచీ కట్టుకుని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తా : జెసిపిఆర్

మూలన పడ్డ మున్సిపాల్టీ చెత్త వాహనాలను రెండు రోజుల్లోగా మరమ్మతులకు పంపకపోతే తాను గోచీ కట్టుకుని తాడిపత్రి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన కు దిగుతానని జెసి.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రయోజనం కోసం తాను నిరసన తెలుపుతుంటే అడగడుగునా అధికార పార్టీ నేతలు అడ్డంకులు సృష్టించడం తగదన్నారు. తాడిపత్రి మున్సిపాల్టీకి చెందిన చెత్త వాహనాల మరమ్మతుల కోసం పట్టణంలో తాను బిక్షాటన చేపడితే స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మెప్పుకోసం ఉద్దేశపూర్వకంగానే తన నివాసం చుట్టూ పోలీసు బలగాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు డీఎస్పీ విఎన్‌కె.చైతన్య యత్నించడంపై జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ప్రజా ప్రయోజనం కోసం ఎలాంటి కార్యక్రమం తలపెట్టినా డీఎస్పీ అడ్డుకుంటున్నారని చెప్పారు. ఆయన తీరులో మార్పురాకుంటే పట్టణంలోని చెత్తను తీసుకెళ్లి డీఎస్పీ కార్యాలయం వద్ద పడవేసి నిరసన తెలుపుతామన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గుత్తి

చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని వక్తలు పేర్కొన్నారు. తైక్వాండో పోటీల్లో గుత్తికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం మండల విద్యాధికారి బి.రవి నాయక్, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, తైక్వాండో అకాడమీ అధ్యక్షులు డాక్టర్ ఎం.శాంతిప్రియ విద్యార్థులను అభినందించారు. పట్టణంలోని ఏపీ ఆదర్శ పాఠశాల, ఆర్ఎస్ లోని ఎవిఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థులతో పాటు పలువురు అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు 14 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండో లో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.ఉష, ఎవిఆర్ పాఠశాల ప్రిన్సిపల్ జానీ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు అల్తాల్ బాషా, ఎస్.ఫైరోజ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

'పివికెకె' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేట వద్దనున్న పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినికి భరత నాట్యం, శాస్త్రీయ సంగీతంలో ప్రథమ బహుమతులు లభించాయి. ఈ నెల 4వ తేదీన ధర్మవరం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎపి ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలలో పీవీకేకే ఐటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న రామలాలిత్యకు భరత నాట్యం, శాస్త్రీయ సంగీతం విభాగాల్లో ప్రథమ బహుమతులు లభించాయి. త్వరలో జరగబోతే రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపికయ్యారు. ప్రథమ బహుమతులు తెచ్చుకున్న విద్యార్థినికి కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

హాస్టల్లో వసతులు కల్పించండి

అనంతపురం : అనంతపురము నగరంలోని ఆర్ట్స్ కళాశాల అనుబంధ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలం మాట్లాడుతూ.. ఆర్ట్స్ కళాశాల అనుబంధ హాస్టల్‌లో మరుగుదొడ్ల సౌకర్యం సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు తిరక్కపోవడంతో దోమల బారిన పడి విద్యార్థులు జ్వరాలబారిన పడుతున్నారన్నారు. చదువుకోవడానికి స్టడీ రూములు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, పార్కింగ్ కోసం సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని, ఆర్ట్స్ కళాశాలలో సీసీ కెమెరాలను పెంచి నిఘాను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

'లా' రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధ్యాపకులు లేరన్న సాకుతో ఎస్‌కె యూనివర్సిటీలో న్యాయ శాస్త్ర విభాగాన్ని రద్దు చేయాలనే నిర్ణయాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాడు నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఐక్య విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పథ్వి, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు దేవేంద్ర, నిరుద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు టిపి.రామన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ శ్రీకష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రం విభాగంలో అధ్యాపకులు లేరన్న సాకుతో ప్రవేశాలు నిలిపేయాలని రిజిస్ట్రార్ ఉన్నత విద్యాశాఖకు నివేదిస్తూ లేఖ రాయడం సరికాదన్నారు. ఇటీవల ఎస్‌కెయులోని సమస్యలు, ఉన్నతాధికారుల నియంతత్వ పోకడలు, అన్యాయాలను న్యాయ శాస్త్ర విద్యార్థులు ప్రశ్నిస్తున్నారన్నారు. అలా ప్రశ్నిస్తున్న నేపథ్యంలో యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్ నియంతత్వ పోకడలతో తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైస్ ఛాన్సలర్ న్యాయ శాస్త్ర విభాగం లేకుండా చేయాలని కుట్రపన్నారన్నారు. అధ్యాపకులు లేకపోతే ప్రత్యామ్నాయ పద్ధతులు చూపాల్సి ఉండగా ఇలా కోర్సునే రద్దు చేయాలని చూడడం దుర్మార్గమైన చర్య అన్నారు. న్యాయవిద్యను చదివేందుకు రాయలసీమ జిల్లా విద్యార్థులకు ఎస్‌కెయు ఒక్కటే ఆధారం అన్నారు. ప్రయివేటు కళాశాలలు ఉన్నా అందులో పేద విద్యార్థులు లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి చదివే పరిస్థితి లేదన్నారు. న్యాయ శాస్త్ర విద్యార్థుల భవిష్యత్తు, రాయలసీమ ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని ఎస్‌కెయులో న్యాయశాస్త్ర విభాగాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు వారి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పెద్దఎత్తున విద్యార్థి సంఘాలు, మేధావుల, న్యాయవాదులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పరమేష్, నాయకులు అశోక్ కుమార్, రిషి, సందీప్ రెడ్డి, సంజీవ్, పిడిఎస్‌యు నాయకులు శంకర్, ఆనంద్, లోకేష్ పాల్గొన్నారు.

ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన



సప్తగిరి సర్కిల్లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఐక్య విద్యార్థి, యువజన సంఘం నాయకులు

కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్



నిరనసన తెలుపుతున్న జనసేన కార్యకర్తలు

పోలీస్ కేసులకు..వైసిపి దౌర్జన్యాలకు బెదిరేది లేదు

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

'ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న జనసేన కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్.. పోలీస్ కేసులకు..వైసిపి దౌర్జన్యాలకు జన సైనికులు భయపడరు. అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో ప్రతి ఒక్క కార్యకర్తనూ కంటికి రెప్పలా తాను కాపాడుకుంటాను'..అని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ స్పష్టం చేశారు. గోరంట్ల పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల్లో పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుంటున్న తరుణంలో ప్రశ్నించిన ఐదుగురు జనసేన నాయకులపై వైసీపీ నాయకుల ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. పోలీసులతో వారిని విచక్షణ రహితంగా కొట్టించి వైసిపి నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. తమ కార్యకర్తలపై జరిగిన ప్రతి దాడికీ వడ్డీతో సహా బదులు చెబుతామన్నారు. ప్రజలు పవన్ కళ్యాణ్ వైపు చూస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ ధైర్య సాహసాలను పునికి పుచ్చుకొని వైసిపి ఆగడాలను ఎదుర్కోవాలని వరుణ్ పిలుపునిచ్చారు.

వైసీపీని బీసీలే బంగాళాఖాతంలో కలుపుతారు

టిడిపి బిసిసెల్ నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసి జయహో బిసి అంటూ డ్రామా ఆడుతోందని, వైసిపిని బిసిలే బంగాళఖాతంలోకలుపుతారని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య విమర్శించారు. బుధవారం టిడిపి బిసిసెల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శులు దేవళ్ళ మురళి, వెంకటశివుడు యాదవ్, బీసీసెల్ రాష్ట్ర నాయకులు దలవాయి వెంకటనారాయణ, గంజే నాగరాజు, గాండ్ల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ విశాలాక్షి, కురుబ సాధికారిక కన్వీనర్ గంగులకుంట రమణ హాజరై మాట్లాడుతూ.. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీసీలను వంచిస్తోందన్నారు. కులవృత్తులను కుదేలుచేసి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనక్కు నెట్టిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న బిసి కులాలకు న్యాయం చేయకుండా కేవలం పత్రికా ప్రకటనలకు, బహిరంగ సభలకు పరిమితమైందని ఎద్దేవా చేశారు. విజయవాడలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించే హక్కు వైసిపి ప్రభుత్వానికి లేదన్నారు. 139 కులాలకు 56 కార్పొరేషన్లు పెట్టి ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదన్నారు. వ్యక్తిగత రుణాలు మంజూరు చేయకుండా మొండిచేయి చూపిందన్నారు. చేతివత్తుల వారికి ఆదరణ పనిముట్లను అందించడంలో వైఫల్యం చెందిందన్నారు. లక్షల మంది చేనేత కార్మికులు ఉన్నప్పటికీ కేవలం 80 వేల మందికే నేతన్న నేస్తం అందిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సంక్షేమం పేరుతో సంక్షోభాన్ని సృష్టిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ఇదే చివరి ఎన్నిక అని హెచ్చరించారు. బీసీలతో పెట్టుకున్న ఏ పార్టీ మనుగడ సాగించలేదన్నారు. టిడిపి బీసీల పార్టీ అని రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి బీసీసెల్ అనంతపురం పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనర్సింహులు, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ యాదవ్, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేష్, బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరవకూరు బ్రహ్మయ్య, సుధాకర్ యాదవ్, నీళ్లపాలు రాజగోపాల్, దలవాయి వెంకటేష్, గోపాల్ గౌడ్, కోయగూర్ల పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టిడిపి బిసిసెల్ నాయకులు


స్వాగతం పలుకుతున్న ఎస్ఎస్‌బిఎన్ విద్యార్థులు

ఎన్‌సిసి యూనిటీ ఫ్లేమ్ రన్

అనంతపురం : ఎన్‌సిసి స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఎన్‌సిసి యూనిటీ ఫ్లేమ్ రన్-2022 కార్యక్రమం బుధవారం చేపట్టారు. బుధవారం శ్రీ చైతన్య పాఠశాల పాముదాయి బ్రాంచి విద్యార్థులు ఎన్‌సిసి అధికారులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కర్నల్ భుధువర్, జిల్లా ఎస్పీ ఫకీరప్ప, డిఎస్‌పిలు శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, సిఐ విజయ్‌భాస్కర్ గౌడ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెట్ కర్నల్ భుదువర్ మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచే ఎన్‌సిసి కార్యక్రమంలో పాల్గొని ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వరూప, వైస్ ప్రిన్సిపల్ కరీముల్లా రాయుడు, డీన్ ఒబిరెడ్డి, దర్యావలి, వంశీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్షలు

అనంతపురం : నగరంలోని ఎస్-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు బుధవారం రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కేర్ ఇండియా ఆర్గనైజేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సిపి ఆధ్వర్యంలో 600 మంది విద్యార్థులకు రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రాజు, సెక్రెటరీ డాక్టర్ నిర్మలమ్మ, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూర్ రసూల్, యూనిట్ టు ఆఫీసర్ రమాదేవి, ఎన్‌సిసి ఆఫీసర్ జైను బేగం, కేర్ ఇండియా ఆర్గనైజేషన్ సభ్యులు విశ్వనాథ్, వెంకటరమణ, అరుణ జ్యోతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు : ఆత్మకూరు మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ నందు గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి శంకర నేత్రాలయం వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆయన చేతుల మీదుగా గత వైద్య శిబిరం సందర్భంగా ఆపరేషన్లు చేయించుకున్న వారికి కళ్ల అద్దాలు అందజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయండి

అనంతపురం : బీసీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలని కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్లు కురుబ నారాయణస్వామి, రాగే యల్లప్ప, రాగే మురళి, బెస్త సాధికార రాష్ట్ర డైరెక్టరు మేక షణ్ముఖ ఆధ్వర్యంలో ఎడిఇ విజయలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా బీసీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని, మభ్యపెట్టి నిండా ముంచారన్నారు. 56 కార్పొరేషన్‌లకు కన్వీనర్‌లను, డైరెక్టర్లను నియమించిన ప్రభుత్వం వారి గౌరవార్థమైనా ఒక్కో కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు శివశంకర్, అభి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు చేసుకోండి

బుక్కరాయసముద్రం : పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జెడ్పిటిసి నీలం భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు మరో రెండు రోజుల్లో ముగుస్తుందన్నారు. మార్చి 2019 కంటే ముందు డిగ్రీ, సమాన డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. శింగనమల నియోజకవర్గంలోని గ్రాడ్యుయేట్స్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

రూ.50 వేలు వితరణ

బెలుగుప్ప : గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1985-86 పదవతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డికి డబ్బు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణస్వామి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన సాకే అనిల్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సాకే అనిల్ కుమార్ విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శింగనమల నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయనకు వివరించడంతో పాటు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఎస్టీసెల్ నాయకులు పాల్గొన్నారు.


నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిల్‌కుమార్

మార్చిలోగా ఆసుపత్రి భవనాల నిర్మాణం పూర్తి

కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

ప్రజాశక్తి-రాయదుర్గం

వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాలు పూర్తి చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం రాయదుర్గంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాలను కలెక్టరు పరిశీలించారు. నిర్మాణాల తీరు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి మూడవ అంతస్తు పైకప్పు వేయాల్సి ఉందన్నారు. ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, ఇతర పనులు కూడా జరగాల్సి ఉందన్నారు. గతంలో ఇద్దరు వైద్యులు ఉండగా ఇటీవల జరిపిన నియామకాలలో ఏడుగురు వచ్చారని తెలిపారు. త్వరలోనే ఇతర పోస్టులు కూడా భర్తీ చేస్తామన్నారు. వైద్యులు ఆసుపత్రిలో కంటే ప్రైవేటు ప్రాక్టీస్‌కే ప్రాముఖ్యత ఇస్తున్నారని కొందరు ఫిర్యాదు చేయగా తన దృష్టికి వస్తే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థానికంగా ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో లేరని, బళ్ళారి లేదా అనంతపురం వెళ్లేలోగా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అనంతపురం సర్వజన ఆసుపత్రిలో మాత్రమే ట్రామాకేర్ సెంటర్ ఉందని అవసరమైన చోట ఇలాంటివి ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. వారం పది రోజుల్లోగా 150 పోస్టులు భర్తీ అవుతాయన్నారు. మందుల దుకాణాలలో మందులను అత్యధిక ధరలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు రాగా వాటిపై అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డి, తహశీల్దార్ మారుతి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మాధవి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంఇఒ నాగమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు కూలి పనులకు వెళ్లకుండా చూడండి

పాఠశాలల్లో చక్కగా చదువుకోవాల్సిన పిల్లలు రోజువారీ కూలీలుగా పనులకు వెళ్లకుండా చూడాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. రాదుర్గం మండలంలోని వడ్రహొన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, పల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలల్లో డ్రాపవుట్ నిష్పత్తి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. మైనర్ బాలికలను పెళ్లి పేరుతో చదువుకు దూరం చేయకుండా తల్లిదండ్రులను చైతన్య పరచాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం హీరేహల్ మండలంలోని మురడి గ్రామంలో సచివాలయ భవనం, నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు.


ఆసుపత్రి భవన నిర్మాణలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పది పరీక్షల మోడల్ పేపర్లు ఆవిష్కరణ


మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

2023 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ముద్రించిన పదవ తరగతి మోడల్ పేపర్స్‌ను అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒ ఎం.వెంకట కృష్ణారెడ్డి బుధవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాలను ముద్రించడం వల్ల పిల్లలకు చాలా ఉపయోగ పడుతుందన్నారు. యుటిఎఫ్ నాయకులను అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్రంలో పెద్ద ఉపాధ్యాయ సంఘంగా ఉపాధ్యాయుల పక్షాన పనిచేయడంతోబాటు ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. అందరికీ విద్య అందాలని కోరుతోందన్నారు. సామాజిక స్పృహతో, చైతన్యంతో విద్యారంగ పరిణామాల పట్ల స్పందిస్తూ పని చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మూడు దశాబ్దాలుగా పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు ముద్రిస్తూ తక్కువ ధరకు అందజేస్తోందన్నారు. అధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్లు సగటు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. గత సంవత్సరం ఏడు పేపర్లు పరీక్షలు రాయగా ఈ ఏడాది ఆరు పేపర్లు పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు అనుగుణంగా నిపుణులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత ఈ మోడల్ పేపర్లు రూపొందించి ముద్రించారన్నారు. ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ మోడల్ పేపర్లు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల కోసం, వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రూపొందించామన్నారు. వీటి ద్వారా సాధారణ విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ మోడల్ పేపర్లకు మంచి డిమాండ్ పెరిగి, ప్రతి సంవత్సరము వీటి సంఖ్య పెరుగుతూ ఉందన్నారు. 2023 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలలో పాల్గొనే విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రమణయ్య, వివిధ మండలాల నాయకులు సుబ్బరాయుడు, కొండప్ప, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, ఆదిశేషప్ప, గంగాధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లి నిర్వాసితులను ఆదుకుంటాం

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి -బెలుగుప్ప

జీడిపల్లి రిజర్వాయర్ నుండి ఊటనీరు ఇండ్లల్లోకి, పంట పొలాల్లోకి చేరిన జీడిపల్లి గ్రామ నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. బుధవారం బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి గ్రామాన్ని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధామణి సందర్శించారు. రిజర్వాయర్ ఊటనీరుచే పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను, పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ నందు పిల్లర్లు లేకపోవడం వల్ల నీరుచేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రతి పిడిఎఫ్ యూనిట్‌కు రూ.10 లక్షలు చొప్పున ఇవ్వాలని నివేదికలు కూడా పంపామన్నారు. త్వరలోనే నిర్వాసితులను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఆర్ఐ నగేష్ బాబు, ఎస్ఈ ఇరిగేషన్ అధికారి దేశనాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ భూపతిరెడ్డి, వీఆర్వో గోవిందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లా కోర్సు అడ్మిషన్లు యథాతథంగా నిర్వహిస్తాం : పిఆర్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కే యూనివర్సిటీ నందు 2022-23 సంవత్సరానికి గాను 3 సంవత్సరాల లా కోర్స్ అడ్మిషన్స్ జరుగుతాయని ఎస్కేయూ పీఆర్వో రాంగోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లా విద్యార్థులు రిప్రజెంటేషన్ అనుగుణంగా ఏపీ ఉన్నత విద్యా మండలి సెక్రెటరీ 3 సంవత్సరాల ఎల్ఎల్‌బి కోర్సు రద్దు చేయుటకు ఈసీ అప్రూవల్ అడిగారు. లా అడ్మిషన్స్ ప్రక్రియ ఒక వారంలోపు జరుగుతుందన్నారు. ఈసీ మీటింగ్ వారంలోపు నిర్వహించడం కష్టతరమన్నారు. ఈ రెండు విషయాలను దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీ అధికారులు 2022-23 సంవత్సరానికి గాను 3 సంవత్సరాల ఎల్ఎల్‌బి కోర్సుకు అడ్మిషన్లు నిర్వహిస్తామని వెల్లడించారు.

బీసీల ఆత్మాభిమానంపై వైసీపీ రెడ్ల దాడి

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

బీసీల ఆత్మాభిమానంపై వైసిపి రెడ్లు దాడిచేస్తున్నారని, వైసీపీ అగ్రవర్ణ దురహంకారులు రాష్ట్రంలో అడుగడుగునా బీసీల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బుధవారం గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ.. మన బీసీలకు' కార్యక్రమానిన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్నా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. బిసిల సంక్షేమం కోసమని ఆర్భాటంగా ప్రకటించిన 56 కార్పొరేషన్ల పాలకవర్గాల ప్రతినిధుల తొలిసమావేశం అప్పట్లో సకలశాఖల అనాధికార మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిందన్నారు. బీసీ మంత్రులు గతంలో చేసిన బస్సుయాత్ర ముగింపు సభకు అనంతపురంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నీతానై వ్యవహరించారన్నారు. తాజాగా విజయవాడలో జయహో బీసీ పేరిట ఆపార్టీ నిర్వహించిన సభ సైతం విజయసాయి రెడ్డి కనుసన్నల్లో జరగడం వైసీపీ అసలు రూపాన్ని బట్టబయలు చేస్తోందన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల క్రిష్ణతో గతంలో ఓ నిండుసభలో వైవి సుబ్బారెడ్డి తన కాళ్లు పట్టించుకోవడం ద్వారా వైసీపీలో బీసీల స్థానమేమిటో తేటతెల్లం చేశారన్నారు. జగన్ రెడ్డి సారథ్యంలో సదరు నలుగురు రెడ్లు వెనుకబడిన వర్గాల వెన్ను విరుస్తున్నారని విరుచుకుపడ్డారు. వైసీపీలో ఏ ఒక్క బీసీ మంత్రి నేరుగా ముఖ్యమంత్రిని కలిసే పరిస్థితి లేదన్నారు. టీడీపీ బీసీ నేతలను రాజకీయంగా, ఆర్థికంగా అణచివేయడం, సొంత పార్టీ బీసీలను అవమానించడమే జగన్ పార్టీ అజెండాగా సాగుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న దారుణ వివక్ష, అన్యాయాలపై అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరుమెదపక పోవడం వారి బానిసత్వాన్ని చాటుతోందన్నారు. ఎన్నో ఆశలతో గత ఎన్నికల్లో ఓట్లేసిన బీసీలంతా ఇప్పుడు ప్రతిక్షణం కుమిలిపోతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు రాజకీయాల్లో, అధికారంలో అసలైన భాగస్వామ్యం ప్రారంభమైందన్నారు. ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు ఎంతోమంది బీసీలను మంచి నాయకులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. ప్రస్తుతం తాము అధికారంలో లేకపోయినా పార్టీలో తమలాంటి బీసీలదే తిరుగులేని నాయకత్వమని ఆయన స్పష్టం చేశారు. జగన్‌రెడ్డి వంద జన్మలెత్తినా ఒక్క బీసీ నాయకుడిని కూడా తయారు చేయలేడన్నారు. ఈ రాష్ట్రంలో మళ్లీ బీసీల పాలన చూడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందుకోసం ప్రతి బీసీ శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గిరిమల్లప్ప, భూపసముద్రం మాజీ సర్పంచి గోవిందప్ప, వన్నూరుస్వామి, నవీన్, రమేష్, లోకేష్, క్లస్టర్ ఇంఛార్జి సన్నన్న, నాగరాజు, రంగస్వామి, సర్పంచి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


వైసిపి వైఫల్యాలను వివరిస్తున్న మాజీ మంత్రి కాలవ

రూ.5.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడతాం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం


వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అనంతపురం నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీల్లో అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఎ.నారాయణపురం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ రూపొందించిన బుక్‌లెట్లను ప్రతి కుటుంబానికి అందజేశారు. స్థానికంగా సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మూడున్నరేళ్లుగా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ అందిస్తున్నామన్నారు. 2007లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎ.నారాయణపురం పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో పట్టాలు అందించినట్లు చెప్పారు. 16 ఏళ్లు గడుస్తున్నా కాలనీ ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయిందన్నారు. ఇక్కడ 900 కుటుంబాల వరకు ఉన్నాయని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఏకంగా రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలు చేశామన్నారు. మరో ఐదారు నెలల్లో పనులన్నీ పూర్తి అవుతాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఏదైతే హామీలు ఇచ్చామో అవన్నీ నెరవేరుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు. నారాయణపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో చెక్ డ్యాం వద్ద రూ.550 కోట్లతో త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం చేస్తామని స్పష్టం చేశారు. నగరానికి దీటుగా నాలుగు పంచాయతీలను అభివృద్ధి చేస్తామన్నారు.

'అభివృద్ధి కావాలంటే బాబు రావాలి'

టిడిపి కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన ఖర్మ పోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వేపులపర్తి, గుండిగానిపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరామరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వేపులపర్తి గ్రామంలోని టిడిపి కార్యకర్తలు ఉమామహేశ్వర్ నాయుడుకు ఘనంగా స్వాగతం పలికారు. ఆనంతరం సమస్యలపై ఆయన పాదయాత్ర చేపట్టారు. అనంతరం వేదవతి హగరి నదిపై ఉన్న కాజ్ వేపై ఆందోళన చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోవడంతో రాయదుర్గం-కళ్యాణదుర్గం నియోజకవర్గాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో తెదేపా ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన ఖర్మ తొలగాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సీనియర్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


వేపులపర్తిలో ఇదేం ఖర్మమన రాష్ట్రానికి కార్యక్రమం

నేరాలు ఘోరాలు

సబ్సిడీ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నుంచి కర్నాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిపోతున్న 67 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యాన్ని బళ్లారి-అనంతపురం బైపాస్ రహదారిలో బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సబ్సిడీ బియ్యాన్ని మరో వాహనంలోకి మారుస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. బియ్యంతోపాటు బొలెరో, ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు గందోడి మారేష్, సుధాకర్, చంద్రశేఖర్ లను అరెస్టు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు శివప్రసాద్, ఉరవకొండ సిఎస్‌డిటి రమేష్ బాబు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో వేలంపాట

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉండబండ వీరభద్రస్వామి దేవస్థానం నందు సప్లయర్స్ సామానులు బాడుగకు ఇచ్చుకొను హక్కు, టెంకాయలు విక్రయించు కొను హక్కు ఒక సంవత్సరానికి గాను దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఎ.కృష్ణయ్య పర్యవేక్షణలో ఆలయ ఈవో రమేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం వేలంపాట నిర్వహించారు. ఉండబండ గ్రామానికి చెందిన హెచ్‌పి.వన్నూరుస్వామి సప్లయర్స్ సామాన్లుకు సంబంధించి రూ.1.06 లక్షలు, టెంకాయలు విక్రయించుకొను హక్కుకు రూ.2.25 లక్షలు వేలంలో పాటపాడి దక్కించుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బసవరాజు, షణ్ముఖ గౌడ్, గోవిందు, ఉండబండ భాస్కర్, ఆలయ సిబ్బంది లీలావతి, పురుషోత్తం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి-గార్లదిన్నె

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై మండల స్థాయి అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు ఎంపీటీసీలకు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనంతపురం డిఎల్‌డిఒ ఓబులమ్మ హాజరైన అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచ వలసిన అంశాలపై సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి, ఇఒఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిపై ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కమలాభాయి, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని బసవ నాగలింగేశ్వర దేవాలయం నిర్మాణానికి తనవంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆలయ కమిటీ ప్రతినిధులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామనాథం, గోపాల్, మాధవరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-శింగనమల

రైతు సమస్యలపై ఈనెల 12న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో శింగనమల నియోజకవర్గ కమిటీ సమావేశం రాజశేఖర్‌శెట్టి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి హాజరయ్యారు. జాఫర్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఈ నెల 12వ తేదీన అనంతపురంలో కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాలో రైతులు, కూలీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మధు యాదవ్, రాము, చేతివృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు సివి హరికృష్ణ, మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు, బికెఎస్ మండల కార్యదర్శి మర్రిస్వామి, నార్పల మండల కార్యదర్శి సూరి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఈ నెల 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిచనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. బుధవారం ఉరవకొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదలచేశారు. కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శులు వన్నూరు సాహెబ్, రైతు సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చెన్నరాయుడు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు పార్వతి, మండల నాయకులు మల్లికార్జున గౌడ్, గణపమల్లి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లా అడ్మిషన్లు కొనసాగించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లా అడ్మిషన్లను యథావిధిగా కొనసాగించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కనేకల్ రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. లా అడ్మిషన్లు నిలుపుదల చేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని, యథావిధిగా అడ్మిషన్లు జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశ్వవిద్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, కనేకల్ మండలం ప్రధాన కార్యదర్శి శాంతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని మాముదూరు గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. సర్వే నెంబర్ 122లో రైతు బి.రేఖ పొలంలో పత్తి పంటకోత ప్రయోగం నిర్వహించగా 0.915 గ్రాముల దిగుబడి వచ్చింది. సర్వే నంబర్ 99 లోని రైతు కమలాకర్‌రెడ్డి పొలంలో పత్తి పంటకోత ప్రయోగం చేపట్టగా 1,800 గ్రాముల దిగుబడి వచ్చినట్లు ఏవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంట నష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. పి.ఎర్రగుడి, జక్కలచెరువు గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ గుత్తి కోఆర్డినేటర్ హరికృష్ణ, గుంతకల్లు కోఆర్డినేటర్ సాయికిరణ్, జిల్లా రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి అఫతాబ్ ఖాన్, ఎంపీటీసీ ఎంసి.లాలెప్ప, వైసీపీ నాయకుడు ఎం. రామాంజనేయులు, రైతులు రాంభూపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పత్తి పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు



మీకోసం

చెప్పులు, బూట్లు కరుస్తుంటే ఆ భాగానికి పెరుగు రాసి రాత్రంతా ఉంచి తెల్లారి ఎండిన పెరుగును దులిపి ధరించాలి. అప్పడవి కాస్త వదులై, సున్నితంగా మారతాయి.

జీవన సౌరభం

తనకు ఇష్టమైన పనిని మూర్ఖుడు కూడా చేయగలడు. బుద్ధిమంతుడు మాత్రం తాను చేస్తున్న పనిని తనకు ఇష్టమైన పనిగా మార్చుకుంటాడు.

మా పల్లె

చక్కని పంట పొలాలతో మా పల్లె
పచ్చని సువాసన విరజిల్లే
రంగు పూలతో మా పల్లె
అందంతో సొగసిల్లే
పచ్చని రంగులతో ఆ చెట్లు
మా ప్రాణవాయువుకు జీవనమెట్లు
పుల్లటి రుచితో ఆ చింత
చిగురుని తింటే పులకింత
నీలపు రంగుతో ఆ చెరువు
పశుపక్ష్యాదులకు ఆదరువు
తుమ్మచెట్టుకు వేళ్లాడే ఆ గూళ్ళు
చిన్ని పిట్టల పెద్ద తెలివికి నకళ్లు
వరసల అనుబంధాలతో మా పల్లె
అందాల హరివిల్లయి విలసిల్లె .



.- సి.హెచ్.అలేఖ్యా రెడ్డి ,
10వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
ఇందిరా నగర్, సిద్ధిపేట.

చిన్న పిల్లల పెద్ద ఆలోచన

ఆ గ్రామం నగరానికి చాలా దూరంలో ఉంది. అక్కడ ఉన్న పాఠశాల మౌలిక వసతుల లేమితో కునారిల్లుతోంది. చీకటి గదిలో చదువుకోలేక ఆరుబయట వరండాలో చదువుకోవడం, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి కనీససౌకర్యాలు కూడా లేని అలాంటిచోట 8వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఏకమై అతిపెద్ద గ్రామ సమస్యని పరిష్కరించారు. ఎలాగో చూద్దాం.

అరకొర వసతులతో.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాల నుంచి వచ్చిన ఆ పిల్లలు తమ కోసం స్కూల్లో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఊరి బాగు కోసం ఎలా ఉపయోగించారో తెలుసుకుంటే ఆశ్చర్యపోతాం. సాంకేతికతను ఉపయోగించుకుని ఎలా అభివృద్ధి చెందవచ్చో నిరూపించిన ఈ పిల్లలు మహారాష్ట్ర నాందేడ్ గ్రామ నివాసులు.

ఈ ఏడాది ఎండలు బాగా మండిపోయాయి. 50 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు



నమోదయ్యాయి. నాందేడ్ కూడా వేసవి తాపానికి గురైంది. ఎండల కంటే ముందు ఆ గ్రామవాసులకు ముంచుకొంచే వర్షాలు, వరదలు, పంటనష్టం, ఆర్థికంగా దెబ్బతినడం వంటి విషయాలు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ఆ పరిస్థితిని మార్చడంలోనే నాందేడ్ గ్రామ జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు కృషి చేశారు.

ఏం చేశారు? ఎలా చేశారు?

జూన్‌లో స్కూళ్ళు తెరవగానే అందరిలాగే ఈ పిల్లలూ స్కూలుకు వెళ్లారు. అప్పుడే మౌలిక వసతుల లేమితో ఇబ్బందిపడుతున్న స్కూల్లో కంప్యూటర్ ల్యాబ్, సెన్సార్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనతో ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. రాస్ప్ బెర్రీపై, పై జామ్ ఫౌండేషన్ సాయంతో అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ (ఎఎఫ్ఇ) ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఫిజికల్ కంప్యూటింగ్ సెన్సార్‌లతో అమర్చారు. కంప్యూటర్ సైన్స్‌లో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించారు. అవసరమైన సాంకేతిక సాధనాలు సమకూర్చారు. తరగతి గదిలో నేర్చుకున్న ఆ పాఠాలను తమ కుటుంబాలకు ఎలా పనికొస్తాయోనని ఆలోచించారు ఈ పిల్లలు. తమ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేస్తున్న వాతావరణ ప్రతికూలతలను ఎలా అంచనా వేయవచ్చో పరిశీలించారు.

వాతావరణ కేంద్రం ఇలా మొదలైంది..

వాతావరణ కేంద్రం ఏర్పాటులో అత్యంత కీలకమైన విషయం పిల్లల సృజనాత్మకత. తమ ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వారు సమస్యగా చూడలేదు. సవాలుగా స్వీకరించారు. టీచర్లు చెప్పిన సైన్సు పాఠాలను ల్యాబ్‌లో పరీక్షించారు. ఉష్ణోగ్రత, పీడనం, తేమ, గాలి వేగం శాస్త్రీయ సూత్రాలను పరిశోధనల్లో పెట్టారు.

'ఒకసారి నేను మా ఇంటి ముందు ఆడుకుంటున్నాను. పక్కింటి ఆంటీ మా అమ్మతో ఏడుస్తూ మాట్లాడుతోంది. అధిక వర్షాల వల్ల తమ పంట అంతా పోయిందని.. చాలా నష్టపోయామని ఆమె చెప్పడం నేను విన్నాను. ఆమె సంతోషంగా ఉండాలని నేను బలంగా కోరుకున్నాను. అందుకు ఏం చేయాలో అప్పటికి తెలియదు. ఇప్పుడు వాతావరణ కేంద్రం ఏర్పాటుచేసి, అననుకూల పరిస్థితులను అంచనా వేశాం. రైతులను అప్రమత్తం చేశాం' అని ఉత్సాహంగా చెబుతోంది రాజశ్రీ. 'ఈ ఏడాది మా వాతావరణ కేంద్ర సూచనల వల్ల రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తమయ్యారు. చిన్నపిల్లలైనా చాలా పెద్ద సమస్యను పరిష్కరించారని ఆ రోజు అమ్మ దగ్గర కన్నీరు పెట్టుకున్న ఆంటీ నాతో అంటున్నప్పుడు నాకు చాలా చాలా సంతోషం వేసింది' అంటోంది.

'ఒక రైతు పొలంలో పంట వేసినప్పుడు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాడు. కానీ, వాన ఎప్పుడు వస్తుందో.. ఎండ ఎప్పుడు కాస్తుందో తెలియక చాలా ఆందోళన పడతాడు. అప్పుడే మేము అనుకున్నాం..



చైత్రాలి



హర్షవర్ధన్



రాజశ్రీ

వాతావరణ కేంద్రం ద్వారా వారికి సమాచారం అందించాలని. కాని మాలాంటి గ్రామంలో అది సాధ్యమా? అనిపించింది. ఇప్పుడు స్కూల్లో ల్యాబ్ నుంచి ఈ కేంద్రాన్ని నిర్వహిస్తూ రైతులకు సాయం చేస్తుంటే చాలా సంతోషమేస్తోంది' అంటాడు హర్షవర్ధన్.

'మేము చిన్నవాళ్లమే.. కాని సాధించాం. మా ప్రాంతంలో వాతావరణ కేంద్రం స్థాపించాలన్న ఆలోచన రాగానే ముందుగా పూణె వాతావరణ కేంద్ర నిర్వహణను పరిశీలించాం. అది చూశాక మా సమస్య పరిష్కారం కనిపించింది. వాతావరణ కేంద్రం నిర్వహించాలంటే చాలా సెన్సార్లు అమర్చాలి. ఫ్యాను లాగా అమర్చిన సెన్సార్ల ద్వారా గాలి వేగం, పీడనం అంచనా వేయవచ్చు. సెన్సార్లకు అమర్చిన మరో పరికరం ద్వారా గాలి దిశను కూడా తెలుసుకుంటున్నాం' అంటుంది చైత్రాలి.

తమ పరిసరాల్లో సమస్యలను గుర్తించడం.. దానికి పరిష్కారం కనుగొనడంలో ఈ చిన్నారులు కనబర్చిన నైపుణ్యం భావితరాలకు గొప్ప మార్గదర్శకం. రైతన్నల గురించి, వారి బాగు గురించి ఇంతలా పరితపించిన ఈ చిన్నారులు ఎందరినో ఆకర్షిస్తున్నారనడంలో ఆశ్చర్యం లేదు.





ఫైబర్ మెండు

తాటికాయలు బాగా పండి కిందపడినప్పుడు వాటిటెంకల నుంచి భూమిలో పెరిగే తేగలు చాలా రుచిగా ఉంటాయి. ఎటువంటి రసాయనాలు వేయకుండా పండే ఈ తేగలను కాల్చి లేదా ఉడకబెట్టుకుని తినొచ్చు. ప్రకృతిలో సహజసిద్ధంగా పెరిగే ఇవి ఈ కాలంలో విరివిగా దొరుకుతాయి.

- వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. రక్తంలో ఉండే కొవ్వు పదార్థాలను తగ్గిస్తుంది. గుండెజబ్బులు, కాలేయ సమస్యలు తగ్గుతాయి. క్యాన్సర్‌ను దూరం చేసుకోవచ్చు.
- తేగల్లో ఆరోగ్య పోషకాలు పుష్కలంగా వున్నాయి. తేగలను బాగా ఉడికించి, వాటిపై మిరియాలు, ఉప్పు రాసుకుని తీసుకుంటే జలుబు, దగ్గు రాకుండా ఉంటాయి.
- నేలలోపల పెరుగే ఈ తేగల్లో నేలలో ఉండే సూక్ష్మధాతువులు వీటిలో ఉండి శరీరానికి మేలు చేస్తాయి. కాబట్టి వీటిని ప్రతిఒక్కరూ తినొచ్చు. వీటిని నమలడం వల్ల నోటి దుర్వాసన తొలగిపోతుంది.
- ఫైబర్ అధికంగా ఉంటుంది. 60 శాతం పిండిపదార్థంతో పాటు పీచు ఉంటుంది. దాంతో ఆహారం త్వరగా జీర్ణమవుతంది. మలబద్ధక, జీర్ణవ్యవస్థ సమస్యలు తొలగిపోతాయి.
- ఈ పిండి పదార్థం రక్తంలో చెక్కర నిల్వలను నియంత్రిస్తుంది. మధుమేహం ఉన్నవారు వీటిని ప్రతిరోజూ తినొచ్చు.
- ఇవి పిల్లల ఎముకల ఎముకల ఎదుగుదలకు దోహదపడతాయి. రక్తవృద్ధికి సహాయపడుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహారం.

రామోస్ హ్యాట్రిక్

- స్విట్జర్లాండ్‌పై 6-1తో పోర్చుగల్ గెలుపు
- ముగిసిన ప్రి క్వార్టర్స్ పోటీలు
- ఫిఫా ప్రపంచకప్



దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 ప్రి క్వార్టర్‌ఫైనల్లో పోర్చుగల్ జట్టు ఘన విజయం సాధించింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ప్రి క్వార్టర్స్ ఆఖరి మ్యాచ్‌లో పోర్చుగల్ జట్టు 6-1గోల్స్ తేడాతో స్విట్జర్లాండ్‌ను ఓడించింది. పోర్చుగల్ తరపున రామోస్ హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా.. పెపె(33వ ని.), రాఫెల్(55వ ని.), లియో (90+2వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. ఇక స్విట్జర్లాండ్ తరపున ఏకైక గోల్‌ను మాన్యుయోల్(58వ ని.)లో చేశాడు. పోర్చుగల్ జట్టు తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 2-0 ఆధిక్యతలో నిలవగా.. రెండో అర్ధభాగంలో ఏకంగా నాలుగు గోల్స్ కొట్టింది. ఈ మ్యాచ్‌కు పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో బెంచ్‌కే పరిమితం కావడం విశేషం.

క్వార్టర్స్ బెర్త్‌లు ఖరారు..

పోర్చుగల్-స్విట్జర్లాండ్ జట్ల మధ్య మంగళవారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌తో ప్రి క్వార్టర్స్ పోటీలు ముగిసాయి. 3వ తేదీ శనివారంతో గ్రూప్ దశ లీగ్ పోటీలు ముగియగా.. 6న పోర్చుగల్- స్విట్జర్లాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రి క్వార్టర్స్ పోటీలు ముగిసాయి. ప్రి క్వార్టర్స్‌కు మొత్తం 16జట్లు అర్హత సాధించగా.. ఇందులో 2జట్లు ఆసియా ఖండాని చెందిన జట్లు ఉన్నాయి. జపాన్ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో క్రొయేషియా చేతిలో, దక్షిణ కొరియా జట్టు బ్రెజిల్ చేతిలో 4-1తో ఓటమిని చవిచూశాయి. శుక్రవారంనుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

క్వార్టర్‌ఫైనల్లో ఎవరు ఎవరితో..

9(శుక్ర) :	క్రొయేషియా × బ్రెజిల్(రా. 8.30గం॥లకు)
	నెదర్లాండ్స్ × అర్జెంటీనా(రా. 12.30గం॥లకు)
10(శని):	మొరాకో × పోర్చుగల్(రా. 8.30గం॥లకు)
	ఇంగ్లండ్ × ఫ్రాన్స్(రా. 12.30గం॥లకు)

నాలుగు రాష్ట్రాలతో చర్చలు

'పోలవరం'పై కేంద్రానికి సుప్రీం ఆదేశం ● ఫిబ్రవరి 15 కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు వివాద పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టుపై మూడు రాష్ట్రాలతో పాటు రే లా స్వచ్ఛంద సంస్థ, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా వివాదంపై పూర్తి స్థాయి నివేదికను రెండు నెలల్లో సమర్పించాలని ఆదేశించింది. సమస్యలు పరిష్కారానికి రాష్ట్రాల మధ్య చర్చలు నిర్వహించారా అని ప్రశ్నించిన ధర్మాసనం ఆ దిశలో చర్యలు తీసుకోవాలని పేర్కొంది. దీనిపై స్పందించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఏకాభిప్రాయం కుదురుతుందో, లేదో తెలుసుకోవడానికి సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించేందుకు చొరవ తీసుకుంటామని కోర్టుకు తెలిపింది.



తొలుత కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాది వసీం ఖాద్రీ వాదనలు వినిపిస్తూ సెప్టెంబర్ 6న సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం భాగస్వామ్య రాష్ట్రాల మధ్య మూడు సమావేశాలు జరిగాయని, సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) కూడా తన నివేదికను జలశక్తి మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. స్టేటస్ రిపోర్టును దాఖలు చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు.

ఒరిస్సా తరపు న్యాయవాది అరుణ్ కట్పాలియా వాదనలు వినిపిస్తూ సెప్టెంబర్‌లో సంబంధిత రాష్ట్రాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారని, అక్టోబర్ నుండి ఎటువంటి పురోగతి లేదని వివరించారు. అప్పటి నుంచి ఎలాంటి సమావేశం జరగలేదని, ముఖ్యమంత్రులతో సమావేశం షెడ్యూల్ చేయలేదని అన్నారు. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ ఈ ఏడాది భారీ వర్షాలు, వరదల సమస్యలను లేవనెత్తారు. దీనివల్ల భారీ నష్టం జరిగిందని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని రక్షణ చర్యలు చేపడితే, పోలవరం నిర్మాణానికి ఏమీ అభ్యంతరం లేదని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ తరపు న్యాయవాది కూడా సమావేశంలో ఒరిస్సా లేవనెత్తిన అభ్యంతరాలనే తామూ కూడా లేవనెత్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపు న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ పోలవరం నిర్మాణం ఆపవల్సిన అవసరం లేదని, మధ్యవర్తిత్వం జరిగితే సరిపోతుందని తెలిపారు.

పోరాడి ఓడిన టీమిండియా

- మెహిదీ హసన్ సెంచరీ
- కేఎల్ రాహుల్, అక్షర్ అర్ధసెంచరీలు

ఢాకా: రెండో వన్డేలోనూ టీమిండియా ఓటమిపాలైంది. 272 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఐదు పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. బొటనవేలి గాయంతో చివర్లో బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ రోహిత్ శర్మ వీరోచిత పోరాటం మ్యాచ్‌ను గెలిపించలేకపోయింది. రోహిత్ శర్మ 28బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 51 పరుగులు చేశాడు. విజయానికి 6బంతుల్లో 20 పరుగులు చేయాల్సి దశలో.. ముస్తాఫిజుర్ రెహ్మాన్ వేసిన ఓవర్లో రోహిత్ 2ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి ఆశలు రేపాడు. కానీ చివరి బంతికి సిక్స్ కొడితే గెలుస్తుం దన్న దశలో ముస్తాఫిజుర్ యార్కర్ వేయడంతో ఒక్క పరుగూ రాలేదు. దీంతో టీమిండియా స్కోరు 266 పరుగుల వద్ద నిలిచిపోయింది. తొలుత రోహిత్ శర్మ గాయపడడంతో విరాట్ కోహ్లీ(5) ఓపెనర్‌గా బరిలో దిగాడు. మరో ఓపెనర్ శిఖర్ ధావన్(8) సైతం విఫలం కావడం తో 13 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. సుందర్ 11, కేఎల్ రాహుల్ 14 పరుగులకే వెను దిరగడంతో టీమిండియాకు కష్టాలు ప్రారంభమ య్యాయి. శ్రేయస్ అయ్యర్ 6ఫోర్లు, 3సిక్సర్లతో 82పరుగులు, అక్షర్ పటేల్(56) అర్ధసెంచరీతో రాణించడంతో టీమిండియా ఛేదనకు చేరువైంది. అంతకుముందు బంగ్లాకూ శుభారంభం దక్కలేదు. 69పరుగులకే 6వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో మెహిదీ హసన్(100నాటౌట్) సెంచరీకి తోడు, మహ్మదుల్లా(77) 7వ వికెట్‌కు 148పరు గులు జతచేశారు. సుందర్‌కు మూడు, శార్దూల్, ఉమ్రన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. దీంతో బంగ్లా జట్టు 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

టార్గెట్లు పూర్తిచేయని కార్యదర్శులపై ఒత్తిడులు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు అబ్దుల్ రజాక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మునిసిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులను ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శి బి.చంద్రమోహన్ అధికారులు ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మరణించారని పేర్కొన్నారు. ఇటీవల కడప జిల్లాలో ఒక వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శి కూడా మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, చంద్రమోహన్ కుటుంబాన్ని ఆదుకోవాలని రజాక్ విజ్ఞప్తి చేశారు.

'వారాహి' ట్రయల్ రన్‌ను పరిశీలించిన పవన్‌కల్యాణ్

జనసేన అధ్యక్షుడు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న యాత్రకు ప్రత్యేక వాహనం సిద్ధమవుతోంది. ఈ వాహనం ట్రయల్‌రన్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో పరిశీలించారు. ఈ వాహనానికి "వారాహి" రెడీ ఫర్ ఎలక్షన్ బ్యాటిల్" అని పేరు పెట్టినట్లు పవన్‌కల్యాణ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. దుర్గాదేవి సప్త మాతృకల్లో వారాహి ఒకరని, అందుకే ఈ ప్రచార వాహనానికి వారాహి అమ్మవారి పేరు పెట్టారని పేర్కొన్నారు.




ప్రజాకళలు కష్టజీవుల బాధలు తెలియజేస్తాయి

- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు
- అలరించిన ఆట..పాట

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ నేపథ్యంలో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, ప్రదర్శించిన కళా రూపాలు అందరినీ అలరించాయి. మహాసభ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆట పాట వేదికపై ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూలీల ఆటా.. పాట ప్రజల కష్టా లను ప్రతిబింబింపజేస్తాయని తెలిపారు. కష్టజీవుల శ్రమను విద్యార్థి దశలోనే గుర్తించాలన్నారు. సంపద సృష్టికర్తలు శ్రామికులేనని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ నెల 8న జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్ట్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'వ్యవసాయ రంగంలో శ్రామికుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ గౌరవాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో 80 శాతం శ్రామికుల పాత్ర ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, పూర్వ నాయకులు మంతెన సీతారాం, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



జీఆర్ఎస్ పాలిమర్స్...



దేవి శ్రీ ఇండస్ట్రీస్...



ఎస్ఆర్ డ్రిప్, పైప్స్ ..

ఉపాధి కల్పనే లక్ష్యం

♦ సాధారణ స్థాయి నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఘణసాయి పైప్స్ అధినేత నాగేశ్వర గౌడ్

ప్రజాశక్తి-అనంతపురం

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా..సాధారణ స్థాయి నుంచి ప్రముఖ పారిశ్రామిక వేత్తగా ఎదిగారు ఘనసాయి పైప్స్ అధినేత నాగేశ్వర గౌడ్. అనంతపురం జిల్లాతో పాటు ఆంధ్ర, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలలో పివిసికి పేరెన్నికగన్న సంస్థ ఘనసాయి. అతి సాధారణ గృహ నిర్మాణ, వ్యవసాయ అవసరాలకు అవసరమైన పివిసి పైపులను సుదీర్ఘకాలంగా అందిస్తూ జనాదరణ పొందుతోంది ఘనసాయి సంస్థ. బుధవారం ఆ సంస్థ అధినేత నాగేశ్వర్ గౌడ్ ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకున్నారు. జిల్లాలో మూడు దశాబ్దాలుగా ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా నాణ్యత, నమ్మకంతో పలువురికి ఉపాధి కల్పించే దిశలో ముందుకెళ్తు న్నామని చెప్పారు. నాగేశ్వర గౌడ్ బెలుగుప్ప మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన వారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. చిన్నప్పటి నుంచి స్వయం శక్తితో ఎదగాలనే తపనతో ముందడుగు వేశారు. అందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది. పదోతరగతి వరకు రాయదుర్గంలో చదివారు. ఇంటర్ బెలుగుప్ప, డిగ్రీ విద్యను అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో అభ్యసించారు. మొదటి నుంచి చదువుతోపాటు స్వయం శక్తితో ఎదగాలనే తపన ఆయనది. మెకానికల్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్, మోటార్ వైండింగ్ వంటి రంగాలలో నైపుణ్యం సాధించారు. డిగ్రీ అనంతరం 1999 నుండి 2009 వరకు చిన్న చిన్న పనులు చేసుకుంటూ శ్రీ సాయి ఎలక్ట్రికల్స్ మోటార్ రివైండింగ్ వర్క్‌షాప్‌ను సొంతంగా నెలకొల్పారు. ఆ తర్వాత రిటైల్ రంగం నుండి ఉత్పత్తిరంగం వైపు అడుగులు వేశారు. పలువురికి ఉపాధి కల్పించాలన్న తపనతో 2009లో ఘనసాయి పివిసి ఫ్యాక్టరీని అనంతపురం నగరంలోని ఎస్టేట్‌లో ఏర్పాటు చేశారు. అప్పటి ఆంధ్ర బ్యాంకు మేనేజరు సోమరాజులు చేతుల మీదుగా ఘనసాయి ఫ్యాక్టరీని ప్రారంభించారు. వ్యాపార రంగంలో అడుగుపెట్టిన నాటి నుండి నాణ్యతతో కూడిన పైపులు అందిస్తూ ప్రజల ఆదరణ పొందారు. 2013లో మరో అడుగు ముందుకేసి దేవిశ్రీ పివిసి ఫ్యాక్టరీని స్థాపించారు. అప్పటివరకు అర్ధ ఇంచు నుంచి నాలుగు ఇంచుల పివిసి పైపులను ఉత్పత్తి చేసేవారు. దేవిశ్రీ ఫ్యాక్టరీ ప్రారంభం తర్వాత 10 ఇంచుల పైపులను ఉత్పత్తి చేస్తున్నారు. 2016లో ఎస్సార్ డ్రిప్ ఇండస్ట్రీస్, 2022లో జీఆర్ఎస్ పాలిమర్స్ పివిసి పైపులు, అగ్రికల్చర్ డొమెస్టిక్ ఫిట్టింగ్స్ వంటి అన్ని రకాల ఐటమ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. జీఆర్ఎస్ పాలిమర్స్ సంస్థలో మల్చింగ్ సీట్స్ అన్ని రకాల మైక్రాన్స్‌లో వ్యవసాయానికి అవసరమైన విధంగా ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. తమ ఫ్యాక్టరీల్లో అన్ని రకాల పివిసి పైపులు, అగ్రికల్చర్ డొమెస్టిక్ ఫిట్టింగులు, డ్రిప్ లెటర్స్ ఐఎస్ఐ అనుమతులతో అందిస్తున్నామని వెల్లడించారు. దాదాపు 50 నుంచి 60 మంది కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు వందలాది మందికి పరోక్షంగా తాము ఉపయోగపడటం సంతోషకరంగా ఉందని నాగేశ్వర గౌడ్ తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని పారిశ్రామిక రంగంలో నిలబడ్డామన్నారు. అందుకు తమ సోదరులు కరేగౌడ్ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. సోదరులు కరేగౌడ్ నిరంతరం వెన్నంటి ఉండి వ్యాపార రంగంలో కష్టనష్టాలను అధిగమించి ముందుకు వెళ్లడానికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఉత్పత్తి రంగంలో మరింత అభివృద్ధి చెందుతూ ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన వస్తువులను అందిస్తామని తెలియజేశారు.



నాగేశ్వర గౌడ్



కరే గౌడ్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -290484, and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Bendi Tulasi Das, Ph.9490099275, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2019/78422